క్లుప్తంగా

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా రాధాకృష్ణ

భీమవరం: ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా భీమవరం పట్టణానికి చెందిన ఓలేటి రాధాకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన 2026 వరకు పదవిలో కొనసాగుతారు. రాధాకృష్ణ వాసవి క్లబ్ భీమవరం పట్టణ సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయనకు పట్టణంలోని పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

కంటి వైద్య శిబిరం అభినందనీయం

భీమవరం: మున్సిపల్ కౌన్సిలర్‌గా విశేష సేవలందించిన ములుగుర్తి వెంకట్రామయ్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు(తాతరాజు) అన్నారు. బుధవారం పట్టణంలోని 36వ వార్డులో వెంకటరామయ్య జ్ఞాపకార్థం కుమారుడు సుధీర్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, అల్లు శ్రీనివాస్, ఇందుకూరి శివాజీ వర్మ, ములుగుర్తి నాగేశ్వరరావు, కృష్ణప్రసాద్, మజ్జి ప్రసాద్, వరసాల చిన్న, చింతపల్లి శివకుమార్, తాడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ఫ్రిజ్ బహూకరణ

భీమవరం అర్బన్: దాతలు రోగుల సౌకర్యార్థం, ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని వైద్యాధికారిణి ఎ.అరుణరాణి అన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బుధవారం ఉద్ధరాజు ఫౌండేషన్ రిఫ్రిజిరేటర్, ఇన్వర్టర్, కంప్యూటర్, స్టీలు కుర్చీల బహూకరించింది. వైద్యాధికారిణి మాట్లాడుతూ వ్యాక్సిన్‌లు, మందులు భద్రపర్చేందుకు రిఫ్రిజిరేటర్, వేసవి కాలంలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉంటాయని ఇన్వర్టర్‌లు రోగులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. హెల్త్ సూపరిటెండెంట్‌లు, ఏఎన్ఎంలు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

భీమవరం: స్థానిక బలుసుమూడి కుమ్మర్ల వీధికి చెందిన బాలిక కన్పించడం లేదంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలిక ఈనెల 6వ తేదీ రాత్రి స్నేహితుల ఇంటికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు.

బీటెక్ విద్యార్థి..

బీటెక్ చదువుతున్న విద్యార్థి ఈనెల 5వ తేదీ నుంచి కన్పించడం లేదంటూ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం టూటౌన్ ఏఎస్సై మోహనరావు తెలిపారు. భీమవరం రూరల్ మండలం రాయలం గ్రామానికి చెందిన వి.వివేక్ నాయుడు(19) పట్టణంలోని ప్రవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. సరిగా చదవడం లేదంటూ తండ్రి రమేష్ నాయుడు మందలించడంతో ఈనెల 5న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో 6వ తేదీన తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

అయిభీమవరంలో భర్త..

ఆకివీడు: భార్యతో గొడవ పడి భర్త కన్పించకుండా వెళ్లిపోయిన సంఘటన గత నెల 29వ తేదీన జరిగినట్లు ఎస్సై బి.నాగబాబు తెలిపారు. మండలంలోని అయిభీమవరం గ్రామానికి చెందిన కోనాల ఆనంద కుమార్ భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, అప్పటి నుంచి వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య సుధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. రవి కుమార్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

భీమవరం: తన భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను మానసిక, శరీరకంగా వేధిస్తున్నాడంటూ భీమవరం టూటౌన్ పరిధిలోని కలిదిండివారి వీధికి చెందిన ఎన్.రేవతి దుర్గాభవాని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. రేవతి దుర్గాభవానికి 2001 తణుకు పట్టణానికి చెందిన శివకుమార్‌తో వివాహమైంది. అయితే శివకుమార్ వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నాడంటూ బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

మహిళ పట్ల ఆటోడ్రైవర్ అసభ్య ప్రవర్తన

ఉండి: ఆసుపత్రికి వెళుతున్న ఓ మహిళ పట్ల ఆటోడ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకివీడు మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ కుమార్తె అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండటంతో మంగళవారం సాయంత్రం ఆకివీడులో ఆటో ఎక్కి భీమవరం బయల్దేరింది. ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి రాగానే ఆటోలో మహిళ ఒంటరిగా ఉండటంతో ఆటో డ్రైవర్ క్రిస్టియాన్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. దీంతో భయాందోళనకు గురైన ఆమె కేకలు వేయడంతో చుట్టుప్రక్కల జనం అక్కడికి చేరుకున్నారు. వారి సహాయంతో బంధువులకు ఆమె సమాచారం ఇవ్వగా, వారు ఘటనాస్థలికి చేరుకున్నారు. అనంతరం ఆమె ఉండి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా బుధవారం ఆటోడ్రైవర్‌పై హెడ్ కానిస్టేబుల్ యెషయా కేసు నమోదు చేశారు.

సీఎం జగన్‌కు అండగా మహిళలు

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రామరాజు, శ్రీనివాసరాజు
- పండుగ వాతావరణంలో ఆసరా చెక్కుల పంపిణీ
- కాళ్ల మండలం పెద అమిరంలో కార్యక్రమం
- పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర మహిళలంతా ఆశీర్వదిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. నాల్గో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని పెద అమిరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముందుగా పార్టీ నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు 4వ విడతలుగా ఆసరా పథకం కింద సుమారు రూ.66.63 కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. పేదలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్ జగన్‌నే మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు చెప్పే మాయ మాటలు ఎవరూ నమ్మొద్దని కోరారు. రాష్ట్రంలో ప్రజలను ఓటు అడిగే హక్కు ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రెండుసార్లు బటన్ నొక్కి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామని మోసగిస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే డ్వాక్రా మహిళలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా నాలుగు విడుతలుగా రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు నిజంగానే దమ్ముంటే ఒంటరిగా పోటీ చేయాలన్నారు. జగనన్న చెల్లెలుగా వస్తే షర్మిలను గౌరవిస్తామని, కానీ ప్రతిపక్షాలతో కలిసి కుట్రపూరితంగా ఆయన్నే విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గోకరాజు రామరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంటే ఎంతో గౌరవం ఉందని, అందుకే ఏ సంక్షేమ పథకం అమలు చేసినా వారి అకౌంట్లోకే వేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ కోసం ఎంతో శ్రమిస్తున్న పీవీఎల్ నర్సింహరాజును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని మహిళలను కోరారు. పాతపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్న పీవీఎల్‌ను ఉండి ఎమ్మెల్యేగా గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెనుమత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, పెద అమిరం గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, జిల్లా సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, మన్నే నాగరాజు, వీరమల్లు బోసు, సరాబు ముఖేష్, మన్నే శ్రీనివాస్, సాగిరాజు హరివర్మ, మండల స్థాయి నాయకులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగనే మా దేవుడు



కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగున్నరేళ్లుగా ప్రతి ఏటా మా అకౌంట్లో డబ్బులు వేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లారేసరికి వలంటీర్ల ద్వారా ముసలి, వితంతు, దివ్యాంగులకు పింఛన్ అందిస్తున్న జగనే మా పేదవాళ్ళకు దేవుడు అయ్యాడు.

– యాళ్ల మార్తమ్మ, ఏలూరుపాడు

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: రాబోయే వేసవిలో నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల్లో కూడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. మండలంలోని యండగండి సచివాలయం 2 పరిధిలో సర్పంచ్ గోగులమండ చిన కృష్ణమూర్తి ఆధ్వర్యాన జల్ జీవన్ నిధులు రూ.33 లక్షలతో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను (ఓహెచ్ఎస్ఆర్) బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో పీవీఎల్ తాగునీటి సరఫరాపై సమావేశమయ్యారు. అక్కచెల్లెమ్మలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఆర్థికంగా వారికి జగనన్న అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగ్గరాజు, వైస్ ఎంపీపీ దత్తాల సుజాతరాణి, వార్డు సభ్యులు గన్నాబత్తుల తావుడు, కాల రామావతారం, పంచాయతీ కార్యదర్శి కె.పవన్ కుమార్, సచివాలయ కన్వీనర్ వేణు, కాల సర్వేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు జి.సుందర్‌కుమార్, గ్రామ పెద్దలు మంతెన రామరాజు, నంబూరి సత్యనారాయణరాజు, వరహాలరాజు, వెంకటరాజు, సాంబరాజు, కృష్ణ, సుబ్రహ్మణ్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఉండి మండలంలోని పాములపర్రు గ్రామానికి చెందిన వర్రే ఉమా మాణిక్యాంబకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.30 లక్షలు మంజూరు కాగా, బుధవారం పెద అమిరంలోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారుకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెక్కు అందజేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు వర్రే పైడియ్య, సర్పంచ్ కేశన శాంతకుమారి, మాజీ సర్పంచ్‌లు తాటిపట్టి పెద వీరప్ప, నక్కా చెన్నకేశవరావు పాల్గొన్నారు.



యండగండిలో కుళాయిని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

కాళ్ల: మండలంలోని కోమటికుంటకు చెందిన పసుపులేటి సత్యనారాయణకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్షా 30 వేలు మంజూరు కాగా, లబ్ధిదారుకు పీవీఎల్ నర్సింహరాజు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బోనం శివకుమార్, బర్రె మునలయ్య పాల్గొన్నారు.

బలహీన వర్గాల ద్రోహి చంద్రబాబు

- సామాజిక న్యాయం జగనన్నకే సాధ్యం
- ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంబీఈసీ చైర్మన్ పెండ్ర వీరన్న

భీమవరం(ప్రకాశం చౌక్): చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ద్రోహి అని సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న విమర్శించారు. బుధవారం భీమవరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ పక్షపాతిగా సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. రాజకీయంగా బీసీలను చైతన్యం చేయడంలో భాగంగా ఏలూరు ఎంపీ అభ్యర్థిగా రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు, విద్యావేత్త కారుమూరి సునీల్‌కుమార్‌ను, నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గూడూరి ఉమాబాల, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపిక చేసి మరోసారి బీసీల పక్షపాతిగా ఆయన నిరూపించారన్నారు. చింతలపూడిలో టీడీపీ రా.. కదిలిరా సభలో చంద్రబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, ఏలూరు ఎంపీగా ఉన్న కోటగిరి శ్రీధర్, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌ను విమర్శించడం ఖండిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, రాష్ట్ర మంత్రులను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. తాను అధికారంలో ఉండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేసి వారిని అవమానించారన్నారు. 2020లో వర్ల రామయ్యను రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి పెట్టి తీవ్రంగా అవమానపరిచిన చరిత్ర చంద్రబాబుదన్నారు. సీఎం జగన్ ఎస్సీ వర్గానికి చెందిన పాయకరావుపేట ఎమ్మెల్యేగా ఉన్న గొల్ల బాబూరావును రాజ్యసభకు పంపుతున్నారన్నారు. అలాగే ఉమ్మడి విశాఖ జిల్లా పాయికారావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న వంగలపూడి అనితను కొవ్వూరు నియోజకవర్గంలో పోటీకి పెట్టి, అప్పటి మంత్రిగా ఉన్న కొత్తపల్లి జోహార్‌ను తిరువూరులో పోటీ చేయించి అవమానపరిచిన చరిత్ర చంద్రబాబుకి దక్కుతుందన్నారు. అలాగే బీసీ వర్గాలకు చెందిన మత్స్యకారులు విశాఖపట్నంలో చంద్రబాబుకు వినతి పత్రం ఇవ్వటానికి వెళ్తే తోకల కత్తిరిస్తానని, నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు చంద్రబాబును కలవడానికి ఏపీ సచివాలయానికి వెళ్తే తోలు తీస్తామని అవమానపరిచిన చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ మహిళ గూడూరి ఉమాబాలను ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. చరిత్రలో మొట్టమొదటిసారిగా నరసాపురం నియోజకవర్గం ఎంపీ అభ్యర్థిగా బీసీ మహిళకి అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నరసాపురం, ఏలూరు, రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థులుగా ఉన్న బీసీ వర్గాలకు చెందిన ముగ్గురిని పార్లమెంటుకు పంపించడానికి ప్రజలందరూ కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో సంచార జాతర సంఘం గౌరవ సలహాదారు గంట వెంకన్న, భీమవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా కాదు.. పేదోడి భూ హక్కు



చెరుకుమిల్లిలో ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ ప్రకాశం

ఆకివీడు: పేదోడి భూమికి పూర్తి హక్కు కల్పించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రిజిస్ట్రేషన్ ప్రక్రియను అమలుజేయడం దేశంలోనే చరిత్రాత్మకమని సర్పంచ్, అడ్వకేట్ నందమూరి ప్రకాశం అన్నారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామ సచివాలయం వద్ద గత రెండు రోజులుగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కొనసాగుతోంది. ప్రక్రియను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇళ్ల స్థల పట్టాలు గత ప్రభుత్వాలు మొక్కుబడిగా ఇచ్చాయన్నారు. పేదోడికి ఆ భూమిపై హక్కు తాత్కాలికమేనన్నారు. అమ్ముకునే అవకాశం కల్పించలేదన్నారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన తరువాత తీసుకున్న విధానపరమైన మార్పుల్లో పేదోడి ఇళ్ల పట్టా రిజిస్ట్రేషన్ సంచలనాత్మకమైనదన్నారు. దీని ద్వారా పట్టా భూమి విలువ భారీగా పెరుగుతుందన్నారు. గ్రామంలో 140 మంది లబ్ధిదారులకు పట్టాలు, భూమి పంపిణీ చేశామన్నారు. లబ్ధిదారుల పట్టాల్ని పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని చెప్పారు. రిజిస్ట్రేషన్‌కు సహకరిస్తున్న సచివాలయ సిబ్బంది, వీఆర్వో ద్వారకా, కార్యదర్శి పి.శ్రీనివాసరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గూడూరి ఉమాబాలకు అభినందనలు



ఉమాబాలకు అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ సీపీ నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఉమాబాలను పార్టీ మహిళా నాయకులు బుధవారం కలసి అభినందనలు తెలిపారు. పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మద్దా చంద్రకళ, జిల్లా సెక్రటరీ కూడిపూడి నాగలక్ష్మి, పైలా వరలక్ష్మి, పైలా రాజశ్రీ, నాయకులు కొరు మధు తదితరులు ఉమాబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రకళ, నాగలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థిగా ఉమాబాలను ఎంపిక చేసి మరోసారి మహిళా పక్షపాతి అని నిరూపించారన్నారు. ఉమాబాల ఘన విజయం సాధించడం ఖాయమని, ఆమెకు తాము సైన్యంగా పనిచేస్తామన్నారు. నర్సాపురం పార్లమెంట్‌ను బీసీ మహిళకు కేటాయించడం అభినందనీయమన్నారు. నాయకులు ముదునూరి సుబ్బరాజు, కైలా పాండురంగరావు ఉమాబాలను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు

పాలకోడేరు: మండలంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా, ఎండీయూ ఆపరేటర్లతో సమన్వయంగా ఉంటూ, నిత్యావసర వస్తువులు సక్రమంగా సరఫరా చేయాలని తహసీల్దార్ నాగార్జున రేషన్ డీలర్లకు సూచించారు. కొత్త విధుల్లో చేరిన తహసీల్దార్‌ను బుధవారం మండలంలోని రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో మండల రేషన్ డీలర్స్ అధ్యక్షుడు దొంగ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, సీహెచ్ మునేశ్వరరావు, సూరిబాబు, బండి వెంకట సత్యనారాయణ ఉన్నారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ శేషయ్య ఉన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

వీరవాసరం: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎంబీటీ ఏవీఎస్ఎన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వర్ధినీడి సత్యనారాయణ మూర్తి అన్నారు. వీరవాసరం డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశ అభివృద్ధికి ఓటు అనే ఆయుధం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఓటర్ నమోదు కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, వి.దుర్గాప్రసాద్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేగంగా గొల్లవానితిప్ప రోడ్డు పనులు



దేగాపురం వద్ద రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. గత వర్షాలకు రోడ్డుపై గుంతల పడటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. గొల్లవానితిప్ప, గూట్లపాడు, తోకతిప్ప, లోసరి, దొంగపిండి, కొత్తపూసలమర్రు గ్రామాలకు వెళ్లే ఈ రోడ్డు నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. భీమవరం నుంచి గూట్లపాడు రేవు వరకు 11 కిలో మీటర్లు రోడ్డు నిర్మాణ పనులు చకచక జరగడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గాలికుంటు వ్యాక్సిన్‌ను వినియోగించుకోవాలి

భీమవరం అర్బన్: ప్రభుత్వం ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వేసే వ్యాక్సిన్ పశు పెంపకందారులు వినియోగించుకోవాలని మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు కోరారు. భీమవరం మండలంలోని అనాకోడేరులో బుధవారం పశువులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే తీవ్ర జ్వరంతో బాధపడుతుందని, దీంతో పాల దిగుబడి తగ్గిపోయి బలహీనపడి మృతిచెందే అవకాశాలున్నాయన్నారు. పశువులకు తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలన్నారు. గ్రామంలో 220 పశువులకు 45 ఆవులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గోపాల మిత్ర, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు గూట్లపాడులో..

గూట్లపాడు గ్రామంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు తెలిపారు. పశు పెంపకందారులు తమ పశువులను మేతకు వదలకుండా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

నేడు ఆకివీడులో 'ఆసరా' చెక్కుల పంపిణీ

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులోని లయన్స్ ఆడిటోరియం ఎదురుగా గురువారం 'ఆసరా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఆకివీడు మండల, నగర పంచాయతీ పరిధిలోని ఆసరా లబ్ధిదారులు హాజరు కానున్నారు. తొలుత మండలంలోని పెద కాపవరం గ్రామంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలతో వెంకయ్య వయ్యేరు పంట కాల్వ నుంచి పెద కాపవరం మంచినీటి చెరువు వరకు పైప్‌లైన్ విస్తరణ పనులకు భూమిపూజ చేయనున్నారు.

ప్రేమ పేరిట మోసం

ఉండి: ప్రేమ పేరుతో మోసగించి పెళ్లికి ముఖం చాటేసిన యువకుడిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని పాందువ్వ గ్రామానికి మట్టా చిట్టిబాబు అదే ప్రాంతానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించాడు. సమస్య పరిష్కారానికి గ్రామ పెద్దలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.